క్లుప్తంగా

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయలక్ష్మి

ఆదోనిఅర్బన్ : విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని త్రీటౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, సైబర్ నేరాలు, సెల్ ఫోన్ దుర్వినియోగం, ప్రేమ వివాహాలు వాటి పర్యావసనాలు వంటి వాటిపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి సైబర్ నేరం జరిగినా వెంటనే 1930కి ఫోన్ చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది రాజేశ్వరి, ముంతాజ్‌బేగం, వెంకటలక్ష్మి, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ డివిజన్ అధికారి జగన్నాథన్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఉమాదేవి, వెంకటరామిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి ఈరమ్మ పాల్గొన్నారు.

సంపూర్ణ మిశ్రమ దాణా మంజూరు



రైతులకు దాణా అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం: పశువులకు పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమ దాణా మంజూరు చేసిందని పశువైద్యాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కల్లుదేవకుంట పశువైద్య కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి మంజూరైన 20 యూనిట్ల దాణాను కల్లుదేవకుంట సహకార సంఘం అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అందజేశారు. ఒక యూనిట్ పూర్తిధర రూ.3,160 కాగా, రైతులు రూ.1,300 చెల్లిస్తే చాలని, 2 క్వింటాళ్ల దాణా అందజేస్తారని చెప్పారు. జేవీఓ వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలోని 9 గ్రామాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పట్టాలు అందించారన్నారు. ఆప్షన్-3 కింద రూ.19.79 కోట్లతో 766 ఇళ్లు నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆరెకల్లులో-39, బసాపురం-235, బైచిగేరి-80, దొడ్డనగేరి-39, హోసళ్లి-33, మదిరె-79, నాగనాథనహళ్లి-19, పెద్ద పెండెకల్లు-27,పెద్ద తుంబళం -221 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. అయా కాలనీల్లో ఇప్పటి వరకు బేస్ మట్టం లెవల్‌లో- 461, లెంటల్ లెవల్‌లో-1, ఆర్‌సి లెవల్‌లో-1, అర్‌సి కంప్లీట్‌లో-1 ప్లింత్‌బీమ్-166, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో జి.మునీంద్రమ్మ అనే మహిళ శుక్రవారం 32 ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగి ఉండడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. అలాగే మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సాంకేతిక సమస్యలకు పరిష్కారం చూపాలి


ఆదోని సెంట్రల్: ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాల మంజూరులో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రుద్రముని కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు రాక ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎంఈఓ క్యాడర్ స్ట్రెంత్‌లో కాని ఉపాధ్యాయుల పొజిషన్ ఐడీ, అడ్జస్ట్‌మెంట్ ఐడీలకు సంబంధించిన సమస్యలు, సాంకేతిక అంశాల పరిష్కారంలో జాప్యం తగదన్నారు.

హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆదోనిరూరల్ : హమాలీల సమస్యల పరిష్కారానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిప్పన్న, పి.ఎస్.గోపాల్, ఉపాధ్యక్షులు డి.లక్ష్మన్న కోరారు. శుక్రవారం డిగారీ గేటర్ హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని బి.రాజు అధ్యక్షతన పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. డిగారీ గేటర్ హమాలీల కూలి రేట్ల అగ్రిమెంట్ ఆగస్టు 31 నాటికి ముగిసిందని, డిమాండ్ నోటీసు ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా పి.ఎస్.గోపాల్, అధ్యక్షుడు రాజు, కార్యదర్శులుగా ఈరప్ప, వీరాంజిని, సురేష్, బసప్ప, సహాయ కార్యదర్శులుగా మాసేనప్ప, వీరారెడ్డి, వీరప్ప, అయ్యన్నతో పాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భక్తుల ఇలవేల్పు రణమండల ఆంజనేయుడు

- నేడు మహా రథోత్సవం
- శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా విశేష పూజలు
- ఈనెల 26న మహాపూజ, దీక్ష విరమణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



ఆదోనిఅర్బన్ : నియోజకవర్గంతో పాటు సమీపంలో పలు గ్రామాల ప్రజలకు ఇలవేల్పుగా, భక్తుల కోరికలు తీర్చే దేవుడు రణమండల ఆంజనేయ స్వామి. పట్టణ సమీపంలోనున్న రణమండల కొండపై వెలసిన స్వామి వారిని శ్రావణ మాసంలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకుంటారు. ఏటా శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా స్వామి వారికి మహారథోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రథోత్సవం జరిపించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండలో ఉన్న ఉత్సవమూర్తిని స్థానిక ఆర్టగేరి సాయిబాబా ఆలయం వద్ద రథంపై ఆశీనులు గావించి నిర్మల్ టాకీస్ మీదుగా అభయాంజనేయస్వామి, కోట్ల కూడలి, పాత బస్టాండు వరకు కొనసాగి, తిరిగి సాయిబాబా ఆలయం వరకు చేరుతుంది. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ప్రారంభమై రాత్రి 10 గంటలకు ముగుస్తుంది. అలాగే శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా రణమండల ఆంజనేయస్వామి భక్తులు 41 రోజులు మండల దీక్ష చేపడతారు. చివరి రోజున ఈనెల 26వ తేదీన అనంత పద్మనాభవ్రతం సందర్భంగా శ్రావణమాస మహాపూజ, దీక్షధారుల మాల విరమణ ఉంటుంది. రథోత్సవానికి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కొండపైకి రాలేని వారికి దర్శనభాగ్యం కల్పించాలని..



శ్రావణమాసంలో స్వామి వారిని దర్శించుకోలేని వారికి ఆయన దర్శనభాగ్యం కల్పించాలనే ఉద్దేశంతో నాలుగో శనివారం పట్టణ ప్రధాన రహదారిలో రథోత్సవం నిర్వహిస్తాం. గత 30 సంవత్సరాల నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే శ్రావణ మాసం సందర్భంగా స్వామి వారి మాల ధరించిన దీక్షధారులు ఈనెల 26న మహాపూజ నిర్వహించి దీక్ష విరమిస్తారు.

– ఆనంద ఆచారి, ఆలయ పూజారి


ఏర్పాట్లు పూర్తి చేశాం



శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా ప్రతి సంవత్సరం పట్టణంలో రథోత్సవం నిర్వహిస్తాం. ఈ ఏడాది కూడా సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యుత్ దీపాలంకరణ, పూలతోరణం, రథోత్సవం ముందు బొమ్మలాట, ఆధ్యాత్మిక గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– టీజీ పాండురంగయ్యశెట్టి, ఆలయ నిర్వాహకులు

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతం



వరలక్ష్మి వ్రతం చేస్తున్న వేద పండితులు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఆదోనిఅర్బన్ : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక చిన్మయమిషన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక శ్రీవరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతం ఆచరించారు. ముందుగా వరలక్ష్మి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్రతాన్ని ప్రారంభించారు. మిషన్ గురుబ్రహ్మచారి నారాయణచైతన్య, మాతా అనంతానందగిరి అమ్మవారు, గురుయోగేష్ ప్రవచనాలు వినిపించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దతుంబళం, గణేకల్, కుప్పగల్, బల్లేకల్, జాలిమంచి, దొడ్డనగేరి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ చెన్నయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌ల నిర్వహణ పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

20న మండల మీట్

కౌతాళం : ఈనెల 20వ తేదీన ఎంపీపీ అగ్రేష్ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలంలోని వివిధ శాఖ ల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

తప్పే చేశాడు.. శిక్ష అనుభవించాలి



మాట్లాడుతున్న చంద్రకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి

ఆదోనిటౌన్ : 2014-19 మధ్య కాలంలో నాటి సీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో భారీగా అవినీతి జరిగిందని, అందుకు చంద్రబాబునాయుడు శిక్ష అనుభవించాల్సిందేనని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు కంపెనీల నుంచి చంద్రబాబునాయుడు రూ.118 కోట్లు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి, ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. నోటీసులు జారీ చేసి వారం గడుస్తున్నా పవన్ కల్యాణ్, బీజేపీ నాయకులు నోరు మెదపకపోవడంలో అంతర్యమేంటన్నారు. బాబు అవినీతి అక్రమాలపై నిరూపించుకోవాల్సిందిపోయి, తనను అరెస్టు చేస్తారని ముందుగానే ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ముందుగానే ప్రజల్లో సింపతీ పొందేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడకపోతే ఐటీ శాఖ నోటీసులు ఎందుకు జారీ చేస్తుందని ప్రశ్నించారు. లోకేష్, చంద్రబాబునాయుడు చేస్తున్న యాత్రల్లో ప్రజలను రెచ్చగొడుతూ గొడవలు సృష్టిస్తున్నారని, వాటివల్ల వందలాది మంది అమాయకులు బాధితులుగా మారుతున్నారన్నారు. వీరి యాత్రల వల్ల ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో ప్రశాంతంగా జగనన్న పరిపాలన కొనసాగిందని, అయితే ఈ ఆరునెలల వ్యవధిలో పవన్‌కళ్యాణ్ లోకేష్, బాబు యాత్రలతో శాంతిభద్రతల సమస్య సృష్టించారని, ప్రజలను రెచ్చగొట్టడం, గొడవలకు పురమాయిస్తున్నారని చెప్పారు. మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాసు, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పొలకల్ రేణుక, సీనియర్ నాయకులు సింహం నాగేంద్ర, ఆంధ్రా, రామకృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

గల్లంతైన మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ తిమ్మయ్య



సరస్వతి(ఫైల్)

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామ సమీపంలో ఉన్న తుంగభద్ర నదిలో గల్లంతైన కురవ సరస్వతి(27) మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. గ్రామంలోని కురవ పరమేశప్ప పొలం సమీపంలో నదిలో సరస్వతి మృతదేహాన్ని గ్రామస్తులు వెలికితీశారు. మృతదేహాన్ని ఎస్‌ఐ తిమ్మయ్య పరిశీలించారు. అనంతరం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలు కురవ సరస్వతికి భర్త భీమేష్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సచివాలయ నిర్మాణ పనుల పరిశీలన



నిట్రవట్టిలో సచివాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో నిర్మితమవుతున్న సచివాలయాన్ని పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గూళ్యం సచివాలయాన్ని సందర్శించారు. బిల్లులు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈయన వెంట సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.

చిప్పగిరి: మండల కేంద్రంలో రూ.21 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం ఏఈ భవ్య పరిశీలించారు. భవన నిర్మాణ కొలతలు తీశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. మండలంలోని గుమ్మనూరు, బెల్డోణ, దౌల్తాపురం, నగరడోణ, నేమకల్లు, రామదుర్గం, ఏరూరు, డేగులహాలు తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

వలస కూలీ మృతి



బోయ కార్తీక్ (ఫైల్)

హొళగుంద: సుళువాయి గ్రామానికి చెందిన బోయ కార్తీక్ (17) అనే వలస కూలీ గురువారం తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన బోయ తిక్కప్ప, పార్వతి కుమారుడైన కార్తీక్ కొద్ది రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా నందిగామ సమీప పొలాల్లో పత్తి విడుపు పనులు చేసేందుకు వలస వెళ్లాడు. ఆ ప్రాంతంలో జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రవేత్తకు సన్మానం

ఎమ్మిగనూరురూరల్: చంద్రయాన్-3 ప్రయోగంలో పాలుపంచుకున్న నందవరంకు చెందిన శాస్త్రవేత్త కురవ శ్రీరాములును స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం తహశీల్దార్ కె.అంజనేయులు, సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శాస్త్రవేత్త శ్రీరాములు మాట్లాడుతూ.. బెంగుళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

'జగనన్న సురక్ష' పెండింగ్ పనులు పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం : జగన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ రామేశ్వర రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులను 90 శాతం వరకు పూర్తి చేశామని, పెండింగ్‌లో ఉన్న 10శాతం కూడా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆయా శాఖల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, డాక్టర్లు శిరిషా, ఇమానుయేల్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అఖిల, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న కౌతాళం ఎంఈఓ-2 శోభరాణి

కోసిగి: విద్యతోనే పిల్లల భవిష్యత్ మారుతుందని, తద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని కౌతాళం ఎంఈఓ-2 శోభరాణి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్డీటీ స్వచ్ఛం సంస్థ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులతో స్థానిక ఎస్పీ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలం అక్షరాస్యతలో పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. ఆర్డీటీ సిబ్బంది మారుతి, బసవరాజు, వీరేష్ పాల్గొన్నారు.

బ్రిడ్జీలు నిర్మించాలి

ఆదోనిరూరల్: మండలంలోని గణేకల్‌లోనున్న జగనన్న కాలనీకి వెళ్లేందుకు మార్గమధ్యలో ఉన్న వంకపై బ్రిడ్జీలు నిర్మించి లబ్ధిదారులకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు బి.వీరారెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీడీఓ గీతావాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో సుమారు 97 మందికి పట్టాలు పంపిణీ చేశారన్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి వంక అడ్డుగా ఉందని, దీంతో లబ్ధిదారులు రాకపోకలు సాగించలేకపోతున్నారన్నారు. బ్రిడ్జీలు నిర్మిస్తామని చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే ఈ రస్తా వెంబడి సుమారు 300 ఎకరాలకు సంబంధించి రైతులు పంటల సాగు సమయంలో ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీడీఓ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు రామకృష్ణ, నరసప్ప, బంగారయ్య, హుసేని, తాయప్ప, నాగరాజు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



జన్మించిన శిశువును చూపుతున్న 108 సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి గ్రామానికి చెందిన కురువ సాధమ్మ అనే నిండు గర్భిణికి 108 సిబ్బంది సుఖ ప్రసవం అయ్యేలా చికిత్స అందించారు. శుక్రవారం తెల్లవారుజామున సాధమ్మ పురిటి నొప్పులతో బాధపడ్తుండగా ఆశ కార్యకర్త షమ వెంటనే 108కు ఫోన్ చేసి సమాచారం అందించారు. హొళగుంద పీహెచ్‌సీకి చెందిన 108 అంబులెన్స్ నెరణికి గ్రామానికి చేరుకుని గర్భిణిని ఆదోని ఎంసీహెచ్ హాస్పిటల్‌కి తరలిస్తుండగా నెరణికి– ముద్దనగేరి గ్రామ మధ్యలో పురిటినొప్పులు తీవ్రమయ్యాయి. ఈఎంటీ బీకె. యల్లయ్య, పైలట్ ఆసిఫ్ అలీ సహకారంతో సాధమ్మకు చికిత్స అందించగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు పేగు మెడకు వేసుకుని రావడంతో ఈఎంటీ యల్లయ్య జాగ్రత్తగా కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో ఆదోని ఎంసీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. సాధమ్మకు ఇది మొదటి కాన్పు కాగా శిశువుతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉన్నారు. సకాలంలో 108 సిబ్బంది చికిత్స నిర్వహించడం పట్ల కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు అందిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లను రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆలూరు ఏడీఏ సునీత అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో సీహెచ్‌సీ గ్రూపు సభ్యులు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు తీసుకునే యంత్రాన్ని బట్టి 50 శాతం సబ్సిడీ రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ యంత్రాల ద్వారా కందులు, వేరుశనగ, కొర్రల నుంచి నూనెను తీయవచ్చన్నారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాలల్లో 7 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. ఆలూరు ఏఓ వెంకటేశ్వర గౌడ్, టెక్నికల్ ఏఓ దేవ భూషణ్ తదితరులు ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ విద్యాలయం పరమాన్‌దొడ్డి క్రాస్ వద్ద, సోగనూరు రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణంలోని మైనార్టీ కాలనీకి చెందిన దంపతులు దాదాపీర్, షమీనా ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద హోటల్ నిర్వహిస్తున్నారు. ఎమ్మిగనూరు నుంచి పెద్దకడబూరు మీదుగా ఉరుకుందకు బైక్‌పై వెళ్తుండగా పరమాన్‌దొడ్డి క్రాస్ వద్ద కుక్క అడ్డురావటంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. వారిని పోలీస్ రోడ్ సెఫ్టీ వాహనంలో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే సోగనూరు గ్రామానికి చెందిన ఏలీయా బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలో గొర్రెలు అడ్డురావటంతో అదుపుతప్పి కిందపడిపోవటంతో తలకు గాయం కాగా, కుడి భుజం వద్ద ఎముక విరిగింది. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళపై అత్యాచారయత్నం

కృష్ణగిరి: మండలంలోని టి.గోకులపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బలిజ ఆనంద్‌పై గురువారం రాత్రి అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. గత నెల 11వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లోకి బలిజ ఆనంద్ ప్రవేశించి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా కేకలు వేయగా ఇరుగువారు వస్తుండడంతో అక్కడినుంచి పరారయ్యాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే అంతు చూస్తానని బెదిరించినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

13 ఏళ్ల తర్వాత తెలంగాణకు బస్సు సర్వీసు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చూపిన చొరవ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కృషితో నందవరం మండలం నాగులదిన్నె బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో తెలంగాణ రాష్ట్రంలోని అయిజ, గద్వాలకు 13 ఏళ్ల తర్వాత బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు సర్వీసును డీఎం అమర్నాథ్ ప్రారంభించారు. డీఎం మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు నుంచి నాగులదిన్నె మీదుగా అయిజకు బస్సు సర్వీసు ప్రతి రోజు ఉదయం 6.30 గంటలకు బయలుదేరుతుందన్నారు. నాలుగు షటిల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

- గ్రామాల్లో పర్యటిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్'
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను వారానికొకసారి పరీక్షిస్తున్న వైద్యులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

జీవితంలో అత్యంత ముఖ్యమైన వాటిల్లో ఆరోగ్యం ఒకటి. అయితే ఆర్థిక స్థితిగతుల కారణంగా పేదలు అనారోగ్యం పాలైతే గతంలో పట్టించుకునేవారు లేరు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో పల్లె గడపకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. గ్రామంలోకి వైద్యులు వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కోసిగి: మండలంలో 26 గ్రామాలు ఉన్నాయి. కోసిగి, కందుకూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నలుగురు డాక్టర్‌లు పనిచేస్తున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ మనోజ్‌కుమార్, అనురూప్, నజీర్ అహ్మద్, రజిత హెల్త్ సూపర్‌వైజర్స్ ఇద్దరు, హెల్త్ అసిస్టెంట్స్-3, స్టాఫ్‌నర్స్-3, ఏఎన్ఎంలు-17, ఎంఎల్‌హెచ్‌పీలు-16 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే మండలానికి రెండు 104 వాహనాలు కేటాయించారు. ఇందులో రోజు నాలుగు లేక ఐదు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. అందులో ఒక్కొక్క వాహనానికి ఒక ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉంటూ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్ కలిసి సేవలు అందిస్తున్నారు. దీర్ఘకాలంగా బాధపడుతున్న వారికి వారానికొకసారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే 104 వాహనం ద్వారా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. అందులో ముఖ్యంగా హెచ్‌బీ, బ్లడ్ గ్రూప్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్, వీడీఆర్ఎల్, ఆర్‌బీఎస్, గర్భనిర్ధారణ, యూరిన్, షుగర్ తదితర టెస్టులతో కలిపి 46 రకాల వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే మండలంలోని గ్రామాల్లో వైద్యసేవలు అందుబాటులో ఉండేలా 14 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో సజ్జలగుడ్డం గ్రామంలో నిర్మాణం పూర్తి కాగా మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉండుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెబుతున్నారు. అలాగే కాచి వడబోసిన నీటిని తాగాలని సూచిస్తున్నారు. చిన్నపాటి జ్వరం, జలుబు, దగ్గు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని చెబుతున్నారు.



సాతనూరులో ఇంటి వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనురూప్ (ఫైల్)



కోసిగి అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం (ఫైల్)

డాక్టర్ ఇంటికొచ్చి పరీక్షిస్తున్నారు



నాపేరు రామన్న, సాతనూరు గ్రామం. కొద్ది రోజులుగా ఆయాసం, జ్వరం వంటి వ్యాధితో బాధపడుతున్నా. ఫ్యామిలీ డాక్టర్ అనురూప్ వారానికొకసారి మా ఇంటి వద్దకు వచ్చి ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గతంలో ఆర్ఎంపీనే మాకు పెద్ద దిక్కుగా ఉండేవారు. మారుమూల గ్రామంలో ప్రభుత్వ డాక్టర్ ఇంటి వద్దకు వచ్చి వైద్య పరీక్షలు చేయడం సంతోషంగా ఉంది.

– రామన్న, సాతనూరు

ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం



కోసిగి మండలానికి రెండు 104 వాహనాలు కేటాయించారు. ఇద్దరు డాక్టర్లు పీహెచ్‌సీలో ఉంటూ ఓపీలు చూస్తున్నాం. మరో ఇద్దరు డాక్టర్లు రెండు లేక నాలుగు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాం. ఇక నడవలేని, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపతున్న వారికి వారానికొకసారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను సమీక్షిస్తున్నాం. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ మనోజ్‌కుమార్, కోసిగి